క్లుప్తంగా

నేడు యాచారంలో ఎమ్మెల్యే పర్యటన

యాచారం: మండలంలో ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి గురువారం పర్యటిస్తారని ఎంపీడీఓ విజయలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం ఊరూరా చెరువుల పండుగ ఉంటుందని ఆమె తెలిపారు. నక్కర్తమేడిపల్లి, తక్కళ్లపల్లి, మల్కీజ్‌గూడ, చింతపట్ల, నందివనపర్తి గ్రామాల్లోని చెరువుల వద్ద వేడుకలు నిర్వహిస్తామని, చింతపట్లలోని లక్ష్మణ్ చెరువు వద్ద జరిగే చెరువు పండుగలో ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పాల్గొంటారని ఆమె తెలిపారు. ఎంపీపీ కొప్పు సుకన్య, జెడ్పీటీసీ సభ్యురాలు చిన్నోళ్ల జంగమ్మ పాల్గొంటారని తెలిపారు.

ఆదిబట్ల ఎస్‌ఐ లక్ష్మీనారాయణ బదిలీ

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐగా పనిచేస్తున్న లక్ష్మీనారాయణ బదిలీ అయ్యారు. ఆదిబట్ల పీఎస్‌లో అడ్మిన్ ఎస్‌ఐగా పనిచేసిన ఆయన మూడు సంవత్సరాలు ఇక్కడ సేవలందించారు. సాధారణ బదిలీల్లో భాగంగా రాచకొండ పోలీస్ కమిషనర్ బుధవారం లక్ష్మీనారాయణను బదిలీ చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. స్పెషల్ బ్రాంచ్‌కి బదిలీ అయినట్లు సమాచారం.

ఇంటింటికి సీపీఐ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ఇబ్రహీంపట్నం: ఇంటింటికి సీపీఐ ముగింపు బహిరంగసభ వాల్‌పోస్టర్‌ను ఆ పార్టీ నేతలు బుధవారం ఇబ్రహీంపట్నంలో ఆవిష్కరించారు. ఈనెల 11న కొత్తగూడెంలోని ప్రకాశం మైదానంలో బహిరంగసభను నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు. ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రాములు, నాయకులు జంగయ్య, రవీంద్రాచారి, లక్ష్మయ్య, నర్సింహ, పర్వతాలు, మారయ్య, రామకృష్ణ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

ఇబ్రహీంపట్నం: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన దండుమైలారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త మురళీకృష్ణ కుటుంబానికి ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రాంరెడ్డి బుధవారం ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మురళీకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మురళీకృష్ణ కుటుంబానికి భవిష్యత్‌లో ఎలాంటి సహాయం కావాలన్నా అండగా ఉంటామని రాంరెడ్డి తెలిపారు.

పేదలకు అండగా ఉంటాం..

యాచారం: కష్టం వచ్చిన ప్రతి పేదవాడిని ఆర్థికంగా ఆదుకుంటానని బీఆర్‌ఎస్ రాష్ట్ర నేత క్యామ మల్లేష్ పేర్కొన్నారు. యాచారం గ్రామానికి చెందిన గడల లింగం ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. క్యామ మల్లేష్ బుధవారం యాచారంలోని గడల లింగం ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. రూ.10వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ తలారి మల్లేష్, బీఆర్‌ఎస్ నేతలు శ్రీనివాస్, వెంకటేశ్, ముజాకిర్, కృష్ణ తదితరులు ఉన్నారు.

గుర్లకుంట తండాకు చెందిన..

కడ్తాల్: కడ్తాల్ గ్రామ పంచాయతీ పరిధిలోని గుర్లకుంట తండాకు చెందిన బిచ్యానాయక్ అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని స్థానిక సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి పరామర్శించారు. అనంతరం బాధిత కుటుంబానికి రూ.5వేలు ఆర్థిక సాయం అందించారు. పరామర్శించిన వారిలో గిరిజన సేవాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్, వార్డుసభ్యులు ఉన్నారు.

'అంగన్‌వాడీ సేవలను వినియోగించుకోవాలి'



చిన్నారులకు ఏ-విటమిన్ సిరప్ వేస్తున్న సర్పంచ్ స్వప్న

తలకొండపల్లి: ప్రతి చిన్నారిని అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని సర్పంచ్ స్వప్న అన్నారు. బుధవారం మండల పరిధిలోని చెన్నారం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఏ-విటమిన్ సిరప్ అందజేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన సర్పంచ్.. చిన్నారులకు సిరప్ తాపించారు. అనంతరం చిన్నారులకు పలకలు పంపిణీ చేశారు. గర్భిణులకు గుడ్లు అందజేశారు. అంగన్‌వాడీ టీచర్ అనంతమ్మ, కార్యదర్శి చంద్రశేఖర్, భాస్కర్‌రెడ్డి, ఆశ వర్కర్లు, గర్భిణులు, చిన్నారులు పాల్గొన్నారు.

ఆరోపణలు అవాస్తవం: బీజేవైఎం

తలకొండపల్లి: ఆయుష్మాన్ భారత్‌లో ప్రజలను నమోదు చేయించడంలో బీజేపీ కార్యకర్తలు డబ్బులు తీసుకున్నారని ఓ ప్రధాన రాజకీయ పార్టీకి చెందిన నాయకుడు ఆరోపణ చేయడం సిగ్గుచేటని నియోజకవర్గ కన్వీనర్, ఉప సర్పంచ్ అనిల్ మండిపడ్డారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఈ ఆరోపణలు చేసిన నాయకుల వద్ద రుజువులు ఉంటే బయటపెట్టాలని కోరారు. బీజేపీ కార్యకర్తల నిజాయితీని ఎదుర్కొనే దమ్ములేకనే ఇలాంటి పనికిమాలిన అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. బీజేపీ కార్యకర్తల జోలికి వస్తే తగిన గుణపాఠం తప్పదన్నారు.

సాగుకు సన్నద్ధం

యాచారంలో 20వేల ఎకరాలపైగా పంటల సాగు
10వేల ఎకరాల మేర పత్తిపంట పండించే అవకాశం
ఎరువులు, విత్తనాల కొరత రానివ్వమంటున్న వ్యవసాయాధికారులు



నక్కర్తమేడిపల్లిలో పత్తి విత్తనాలు విత్తేందుకు సిద్ధం చేసిన పొలం

యాచారం: వానాకాలం పంటల సాగుకు రైతన్నలు సన్నద్ధం అవతుండటంతో వారికి కావాల్సిన విత్తనాలు, ఎరువులు అందించేందుకుగాను వ్యవసాయశాఖ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. యాచారం మండలంలోని 24 గ్రామాల్లో సాగుకు యోగ్యంగా 25వేల ఎకరాలకు పైగా వ్యవసాయ భూమి ఉంది. అందులో ఈ వానాకాలం కింద దాదాపు 20వేల ఎకరాలకు పైగానే పంటలు సాగుచేసే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. గతేడాది కురిసిన సంవృద్ధి వర్షాలతో చెరువులు, కుంటల్లో పుష్కలంగా నీళ్లు ఉండటంతో 7వేలకు పైగా ఉన్న వ్యవసాయ బోరుబావుల్లో భూగర్భజలాలు దండిగా ఉన్నాయి. వ్యవసాయ బోరుబావుల కింద ఇప్పటికే రైతులు రోహిణి కార్తె వరినార్లు వేశారు. కేవలం వరి పంటనే 8వేల ఎకరాలకు పైగానే సాగయ్యే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు అంటున్నారు. పక్షం రోజుల కిందటే ఆయా గ్రామాల్లోని రైతులు తమ వ్యవసాయ పొలాలను సిద్ధం చేసుకున్నారు. ప్రభుత్వం జూన్ నెల చివరలో రైతుబంధు డబ్బులు కూడా జమ చేస్తుందనే ప్రకటనతో రైతులు సాగుకు సన్నద్ధం అవుతున్నారు. వర్షాలు కురిస్తే వెంటనే పచ్చ జొన్నలు, కందులు, పెసర్లు, ఉలువలు సాగు చేయడానికి రైతులు ఆసక్తి చూపుతున్నారు.

దండిగా నిల్వలు..

ఈ ఏడాది వానాకాలం కింద పంటల సాగు గణనీయంగా సాగయ్యే అవకాశం ఉన్న దృష్ట్యా రైతులు ఇబ్బంది పడకుండా వ్యవసాయ శాఖ కావాల్సిన ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల దిగుమతికి ఉన్నతాధికారులకు నివేదిక పంపింది. 460 టన్నుల డీఏపీ, 295 టన్నుల యూరియా, 130 టన్నుల పొటాషియం, 15 క్వింటాళ్ల కందులు, రెండున్నర క్వింటాళ్ల జొన్నలు, 3 టన్నుల వరి విత్తనాలు, మరో 10 టన్నుల వరకు పలు రకాల కూరగాయల విత్తనాలు అవసరమయ్యే అవకాశం ఉంటుందని వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులకు నివేదిక పంపింది. మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న గుర్తింపు పొందిన ఫర్టిలైజర్స్ దుకాణాల్లో రైతుల డిమాండ్‌ను బట్టి కావాల్సిన విత్తనాలు, ఎరువులు నిల్వచేసి సిద్ధంగా ఉంచాలని వ్యాపారులకు సూచనలు చేసింది. యాచారం పీఏసీఎస్ కార్యాలయంలో కూడా కావాల్సిన వరి విత్తనాలు, ఎరువులు, ఇతర మెట్ట పంటల విత్తనాలు నిల్వ చేసే విధంగా చూస్తున్నారు.

ఊపందుకున్న పత్తి విత్తనాల కొనుగోళ్లు..

పత్తిసాగులో ఇబ్రహీంపట్నం డివిజన్‌లో మాడ్గుల్ మండలం తర్వాతి స్థానంలో యాచారం మండలం ఉంటుంది. మాడ్గుల్ మండలంలో 15వేల ఎకరాలకు పైగా పత్తి సాగు అవుతుండగా.. యాచారం మండలంలో 12వేల ఎకరాలకు పైగా పత్తిపంట సాగు అవుతుంది. రెండేళ్లుగా పత్తి ధర క్వింటాల్‌కు రూ.7వేలకు పైగానే పలుకుతుండటంతో ఈ ఏడాది కూడా పత్తి పంట సాగు వైపు రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే పొలాలను సిద్ధం చేసుకుంటున్న రైతులు వర్షాలు కురిసిన వెంటనే పత్తి విత్తనాలు విత్తేందుకు సిద్ధమవుతున్నారు. యాచారం మండలంలోని నక్కర్తమేడిపల్లి, నందివనపర్తి, చౌదర్‌పల్లి, నల్లవెల్లి, చింతపట్ల, నస్దిక్‌సింగారం, గునుగల్, గడ్డమల్లయ్యగూడ, యాచారం తదితర గ్రామాల్లో వందలాది ఎకరాల్లో పత్తి పంట సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. రైతులు ఇప్పటికే దాదాపు రూ.2 కోట్లకు పైగా పత్తి విత్తనాలు కొనుగోలు చేసి ఇళ్లల్లో సిద్ధంగా ఉంచుకున్నారు. మరో రూ.కోటికి పైగా విత్తనాలను వ్యాపారుల వద్ద పంట ముడి పద్ధతి కింద తెచ్చినిల్వచేసి ఉంచుకున్నారు.

15 ఎకరాల్లో పంటల సాగు



ఈ ఏడాది 15 ఎకరాల్లో పత్తి, వరి పంటలు సాగు చేయడానికి పొలాలను సిద్ధం చేస్తున్నాను. పంట సాగు, కూలీల ఖర్చు, విత్తనాలు, పురుగు మందుల ఖర్చు కింద రూ.20 లక్షలకు పైగానే ఖర్చు అయ్యే అవకాశం ఉంది. గతేడాది పత్తి పంటలో మంచి దిగుబడి వచ్చింది. లాభాలు కూడా వచ్చాయి. మరో రెండు ఎకరాల్లో వివిధ రకాల కూరగాయల పంటలు సాగు చేస్తాను. బోరుబావుల్లో భూగర్భజలాలు పుష్కలంగా ఉన్నాయి. సాగుకు సర్వం సిద్ధం చేశాను.
– బీరప్ప, రైతు, నక్కర్తమేడిపల్లి

నకిలీ విత్తనాలపై ఉక్కుపాదం



ఈ ఏడాది యాచారం మండలంలో పలు గ్రామాల్లో 17వేల ఎకరాలకు పైగానే వివిధ రకాల పంటలు సాగయ్యే అవకాశం ఉందని అంచనా వేశాం. సాగు డిమాండ్‌ను బట్టి కావాల్సిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు నిల్వ ఉంచడానికి కృషి చేస్తున్నాం. రైతులకు ఎరువులు, విత్తనాల కొరత రానివ్వం. పత్తి విత్తనాల విక్రయాల విషయంలో నకిలీవి విక్రయించకుండా నిఘా పెట్టాం. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేసిన ప్రతి రైతు ఖచ్చితంగా రశీదులు పొందాలి. – సందీప్‌కుమార్, వ్యవసాయాధికారి, యాచారం

తెలంగాణ రన్‌పై ఎమ్మెల్యే సమీక్ష



పోలీస్ అధికారులతో సమీక్షలో ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 12న పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే తెలంగాణ రన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో పోలీస్ అధికారులతో ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించే తెలంగాణ రన్‌పై పోలీసులకు దిశానిర్దేశం చేశారు. గురునానక్ ఇంజనీరింగ్ కళాశాల నుంచి బీడీఎల్ రోడ్డు వరకు తెలంగాణ రన్ కార్యక్రమాన్ని నిర్వహించాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. తగిన ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీలు ఉమామహేశ్వరరావు, పురుషోత్తంరెడ్డి, సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

కడ్తాల్: ప్రజారోగ్య పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. మండల పరిధిలోని ముద్విన్ గ్రామానికి చెందిన లక్ష్మమ్మకు రూ.28వేలు, మాడ్గుల మండలం నర్సంపల్లికి చెందిన కృష్ణయ్యకు రూ.24వేలు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరయ్యాయి. బాధితులకు బుధవారం ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సంబంధిత చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ సేవ్యానాయక్, రాజునాయక్ తదితరులు ఉన్నారు.

స్వరాష్ట్రంలో చెరువులకు మహర్దశ

సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి



దేవర చెరువు వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న లక్ష్మీనర్సింహారెడ్డి

కడ్తాల్: స్వరాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో చెరువులు, కుంటలు పూర్వ వైభవం సంతరించుకున్నాయని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం నిర్వహించే ఊరూర చెరువుల పండుగ నేపథ్యంలో బుధవారం ఆయన కడ్తాల్‌లోని చెరువులను పరిశీలించారు. ఈ సందర్భంగా లక్ష్మీనర్సింహారెడ్డి మాట్లాడుతూ.. ఊరూర చెరువుల పండుగ సందర్భంగా స్థానిక దేవర చెరువు వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవతో మిషన్ కాకతీయ ద్వారా చెరువులు కుంటలు అభివృద్ధి చెందాయని.. పూర్వ వైభవాన్ని సంతరించుకుని నీటితో కళకళలాడుతున్నాయని తెలిపారు. దీంతో రైతులు మునుపెన్నడూ లేని విధంగా వ్యవసాయ పనులు చేసుకుంటూ ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారని అన్నారు. గురువారం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో రైతులు, మత్స్యకారులచే భారీ ర్యాలీ నిర్వహించి స్థానిక దేవర చెరువు కట్ట వద్ద, ప్రత్యేక పూజలు, సామూహిక భోజన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ మధుసూధనచారి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ లాయక్‌అలీ, నాయకులు నరేందర్‌రెడ్డి, భిక్షపతి, గణేశ్, అశోక్, యాద య్య, బాలయ్య, సత్యనారాయణ, రమేశ్, యాదగిరి, పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్ ఉన్నారు.

చెరువుల పండుగకు ముస్తాబు



ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు వద్ద లైటింగ్ పనులు

ఇబ్రహీంపట్నం: ఊరూరా చెరువుల పండుగకు ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు ముస్తాబయ్యింది. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం ఊరూరా చెరువుల పండుగ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గ్రామాల్లోని చెరువుల వద్ద పారిశుద్ధ్య పనులతో పాటు విద్యుత్ దీపాలను అలంకరిస్తున్నారు. ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు తూము వద్ద ఉన్న నిర్మాణానికి విద్యుత్ లైట్లతో అందంగా ముస్తాబు చేశారు. కట్టపై గల రోడ్డు వెంట వీధిలైట్లను అమర్చారు. ఉత్సాహభరిత వాతావరణంలో వేడుకలను నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఆలయ ముఖద్వార పనులు ప్రారంభం

కడ్తాల్: మండల పరిధిలోని మక్తమాధారం వేణుగోపాల స్వామి ఆలయ ముఖద్వార పనులను గ్రామ సర్పంచ్ సులోచన సాయిలు బుధవారం ప్రారంభించారు. సర్పంచ్ మాట్లాడుతూ.. ఎంతో చరిత్ర గల ఈ ఆలయ విశిష్టతను తెలిపే విధంగా నాలుగు మాసాల్లో ఆలయ ముఖద్వార పనులు పూర్తి చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గణేశ్, నాయకులు శ్రీకాంత్, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

ఆత్మహత్యలు సమస్యలకు పరిష్కారం కావు

ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి

ఆమనగల్లు: రాంనుంతల గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ శ్వేత ఆనంద్ కూతురు శ్రీనిధి మంగళవారం ఆత్మహత్య చేసుకుంది. బాధిత కుటుంబాన్ని బుధవారం ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి పరామర్శించారు. రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు క్షణికావేశంలో ఆత్మహత్య చేసుకోవడం వల్ల కుటుంబం పడే బాధను ఎవరూ తీర్చలేరని అన్నారు. తల్లిదండ్రులకు కడుపుకోత మిగల్చకండి.. కని పెంచి చదివించి.. ప్రయోజకులయ్యే సమయంలో తనువు చాలిస్తే ఆ కుటుంబం పడే బాధ వర్ణనాతీతమని అన్నారు. ఏ సమస్య వచ్చినా కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యంగా ఎదుర్కోవాలని.. అంతేకాని ప్రతి సమస్యకు చావు ఒక్కటే పరిష్కారం కాదన్నారు. ఆయన వెంట శ్రీరాములు, ఫౌండేషన్ సభ్యులు ఉన్నారు.

కమ్మగూడలో 'కంటి వెలుగు'



కంటి పరీక్షలు చేయించుకుంటున్న కౌన్సిలర్ కవిత

తుర్కయంజాల్: కంటి వెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని 18వ వార్డు కౌన్సిలర్ నారని కవిత అన్నారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీ కమ్మగూడ వార్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ శిబిరంలో ఉచితంగా కంటి పరీక్షలు చేయడంతో పాటు అవసరమైనవారికి కళ్లద్దాలు, కంటి ఆపరేషన్లు చేస్తారని తెలిపారు. మాజీ సర్పంచ్ అంజయ్య, శేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు తీర్పు హర్షణీయం

మాసబ్ చెరువు పరిరక్షణ సమితి సభ్యులు

తుర్కయంజాల్: మాసబ్ చెరువు పరిరక్షణ అంశంపై హైకోర్టు తీర్పు హర్షణీయమని తుర్కయంజాల్ మాసబ్ చెరువు పరిరక్షణ సమితి అధ్యక్షుడు బచ్చిగళ్ల రమేష్, ఉపాధ్యక్షుడు కిషన్ అన్నారు. చెరువులో ఎటువంటి అక్రమ నిర్మాణాలు చేపట్టకుండా చూడటంతో పాటు మట్టిని డంప్ చేయవద్దని పేర్కొంటూ ఈనెల 6న హైకోర్టు స్టేటస్-కో విధించిన విషయం తెలిసిందే. బుధవారం తుర్కయంజాల్‌లోని రొక్కం సత్తిరెడ్డి గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో చెరువు పరిరక్షణ సమితి సభ్యులు మాట్లాడుతూ.. గత కొన్నిరోజులుగా పోరాటం చేస్తున్నా.. కోర్టు ఉత్తర్వుల ఏవంటూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని.. అలాంటి అధికారులకు కోర్టు తీర్పు చెంపపెట్టు లాంటిదని అన్నారు. చెరువులోని అక్రమ నిర్మాణాలను తొలగించడంతో పాటు చెరువు హద్దులను ఏర్పాటు చేసి ఫెన్సింగ్ వేసే వరకు తమ పోరాటం కొనసాగుతుందని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో చెరువు పరిరక్షణ సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ రెడ్డి, కోశాధికారి ఐలయ్య, ఉపాధ్యక్షులు కల్యాణ్ నాయక్, యాదిరెడ్డి, ముఖ్య సలహాదారుడు అరుణ్ కుమార్, కార్యవర్గ సభ్యులు సత్యనారాయణ, ఆశీర్వాదం, వీరేశం, విజయానందరెడ్డి, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

మేమున్నామని..



పెళ్లికానుక అందజేస్తున్న నర్సింహులు మిత్రబృందం

తలకొండపల్లి: తమతో పాటు వెల్జాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో(1993-94 ఎస్‌ఎస్‌సీ బ్యాచ్) చదువుకున్న తోటి మిత్రుడు నర్సింహులు 19 సంవత్సరాల క్రితం చనిపోయాడు. అతని కూతురు వివాహం బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో జరిగింది. ఈ సందర్భంగా మిత్రుడి కుటుంబానికి అండగా నిలిచారు అతడి బ్యాచ్‌మెట్స్. అందరూ కలిసి నర్సింహులు కూతురు వివాహానికి కానుకగా రూ.61,021 పెళ్లి మండపంలో అందజేశారు. కార్యక్రమంలో మిత్రులు ఉప సర్పంచ్ అజీజ్, మంజుల, శంకర్‌గౌడ్, రాములమ్మ, కృష్ణయ్య, ఎల్లయ్య, చంద్రమౌళి, రాజేందర్‌రెడ్డి, జైపాల్‌యాదవ్, శేఖర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

హనుమంతునాయక్‌కు సన్మానం



హనుమంతునాయక్‌ను సన్మానిస్తున్న భిక్షపతి

ఇబ్రహీంపట్నం: రాష్ట్ర గురుకుల విద్యాలయాల అడిషనల్ సెక్రటరీ, రాష్ట్ర గ్రూప్-1 అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి హనుమంతునాయక్ పుట్టినరోజును పురస్కరించుకొని బుధవారం బీసీ సంఘం జిల్లా నాయకులు, సంఘ సేవకులు బజారు భిక్షపతి ఆయనను ఘనంగా సన్మానించారు. ఆయన పేదవర్గాలకు, ప్రజలకు మరిన్ని సేవలు అందించేందుకు ఆయురారోగ్యాలను ప్రసాదించాలని ఆ భగవంతుడిని వేడుకున్నట్లు భిక్షపతి తెలిపారు.

బస్తీవాసులకు అండగా ఉంటా

- బస్తీలో ఒక్క ఇటుక కూడా కూలకుండా చూసుకుంటా
- గుంటి జంగయ్యనగర్ బస్తీవాసులకు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి హామీ



బస్తీవాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం: డివిజన్ పరిధిలోని గుంటి జంగయ్యనగర్ బస్తీవాసులకు అండగా ఉంటామని, బస్తీలో ఒక్క ఇటుక కూడా కూలకుండా చూసుకునే బాధ్యత తనదేనని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి బస్తీవాసులకు హామీ ఇచ్చారు. బుధవారం వనస్థలిపురం డివిజన్ పరిధిలోని గుంటి జంగయ్యనగర్ బస్తీలో స్థానికుల కోరిక మేరకు ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా బస్తీవాసులు మాట్లాడుతూ, తమ ఇళ్ల క్రమబద్ధీకరణ కోసం జీఓ 58, 59 కింద దరఖాస్తు చేసుకున్నామని, అయితే 59 జీఓ కింద నమోదు చేసుకున్న వారు అధిక రుసుము కట్టాల్సి వస్తోందన్నారు. అలాగే 58 జీఓ కింద దరఖాస్తు చేసుకున్న వారిని కూడా అధికారులు 59 జీఓ కిందకు తీసుకొస్తున్నారని చెప్పారు. తమ ఇళ్లను కూలగొడతారంటూ కొందరు ప్రచారం చేస్తూ తమను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, 59 జీఓ కింద నమోదు చేసుకున్న వారు అధిక రుసుము కట్టాల్సి రావడంతో బస్తీవాసులతో కలిసి రెండు నెలల క్రితమే కలెక్టర్‌ను కలిశామని, అధిక రుసుము వచ్చిన వారికి తక్కువ వచ్చేలా ప్రతిపాదనలు చేయాలని కలెక్టర్‌ను కోరామన్నారు. 59 జీఓలో వద్దనుకుంటే మళ్లీ దరఖాస్తు చేసుకుంటే 58 జీఓలో నమోదు చేస్తారని ఎమ్మెల్యే తెలిపారు. కొందరు ప్రతిపక్ష పార్టీల నాయకులు లేనిపోని రాద్ధాంతం చేస్తూ ఇళ్లను కూలగొడతారని బస్తీవాసులను తప్పుదోవ పట్టిస్తున్నారని, వారి మాటలు నమ్మొద్దన్నారు. నేను మీకు అండగా ఉంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు చింతల రవికుమార్, నాయకులపాల్గొన్నారు.

'రెగ్యులరైజేషన్ పేరుతో దోచుకుంటున్నారు'

హయత్‌నగర్: ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లను నిర్మించుకున్న వారికి నామమాత్రపు ఫీజుతో క్రమబద్ధీకరిస్తామని 58, 59 జీఓలను తీసుకొచ్చిన ప్రభుత్వం వాటిని అడ్డుపెట్టుకుని పేదల నుంచి లక్షల రూపాయలు వసూలు చేస్తోందని రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి ఆరోపించారు. 58,59 జీఓలను సక్రమంగా అమలు చేయాలని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు బుధవారం హయత్‌నగర్ తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. నోటిఫైడ్ స్లం ఏరియాలో కేవలం పది శాతం రుసుముతో క్రమబద్ధీకరణ చేయాలని జీఓలో ఉందన్నారు. అయినప్పటికీ మండలంలోని రంగనాయకులగుట్ట, వీరన్నగుట్ట, ముదిరాజ్‌కాలనీ, బంజారాకాలనీల్లో ఉంటున్న పేదలకు లక్షల రూపాయలు చెల్లించాలని నోటీసులు ఇచ్చారన్నారు. బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

బీజేపీకి శంకరగిరి మాన్యాలే దిక్కు

ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ఆమనగల్లు: రాష్ట్రంలో రానున్న ఎన్నికల్లో బీజేపీకి శంకరగిరి మాన్యాలే దిక్కని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో బుధవారం ఎమ్మెల్యే మాట్లాడారు. రాష్ట్రంలో బీజేపీ తలకిందులుగా యాత్రలు చేసిన ప్రజలు వారిని నమ్మేస్థితిలో లేరన్నారు. డిమోనిటైజేషన్, జీఎస్టీతో ప్రజలకు ఏం లాభం చేకూరిందో ప్రధాని దేశ ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. మహిళా రెజ్లర్లపై లైంగికదాడులకుపాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్‌పై చట్టపరంగా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. తెలంగాణలో అధికారంలోకి వస్తామని పగటి కలలు కంటున్న బీజేపీ నాయకులకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. రాష్ట్రంలో ప్రజాసంగ్రామ యాత్ర, ప్రజాగోస యాత్ర అని ఎన్ని యాత్రలు చేసినా బీజేపీని ప్రజలు విశ్వసించరని అన్నారు. ఆంధ్రపాలకులకు మంగళహారతి పట్టిన డీకే అరుణ.. సీఎం కేసీఆర్‌ను విమర్శించడం సిగ్గుచేటన్నారు. సమైక్యంగా ఉన్న దేశంలో కులమతాల మధ్య చిచ్చుపెడుతూ అరాచక పాలన సాగిస్తున్న కేంద్రంలోని బీజేపీకి.. ప్రజలు తగిన సమయంలో గుణపాఠం చెబుతారన్నారు. రానున్న పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ సత్తాచాటుతామన్నారు. సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పత్యానాయక్, కుమార్, రమేశ్ తదితరులు ఉన్నారు.